విజయ - మే, 1982

"రాజకీయాల్లో ఫోటోని నమ్మని వారు కొందరు. పెళ్ళిళ్ళకి ఫోటోని నమ్మని వారు కొందరు. ఎవరి కారణాలు వాళ్ళకుంటాయి"

# ఫోటో

నాగేశ్వరరావుకు ఫోటోస్టూడియో లేదు కానీ ఫోటోగ్రఫీ అతడి హాబీ. అతడు ఫోటోలు చాలా బాగా తీస్తాడని పేరు. అందుకే ఫారిన్ వెళ్ళి వచ్చిన అతడి మిత్రుడు తన యాషికా కెమేరాని నాగేశ్వరరావుకి అమ్మేసి తను ఆగ్ఫా ఐసోలి కొనుక్కుని అది చాలుననుకున్నాడు.

ఒకరోజు నాగేశ్వరరావుకు బజార్లో రామచంద్రం అనే స్నేహితుడు కనపడ్డాడు. రామచంద్రం చెల్లెలు భారతికి ఢిల్లీనుండి పెళ్ళి సంబంధం వచ్చిందిట. వరుడొక్కడే ఢిల్లీలో ఉన్నాడు. మిగతా వారంతా ఇక్కడే ఉన్నారు. వరుడి తల్లితండ్రులు పిల్లను చూసి తృప్తిపడ్డారు. కట్నం మాటలు విని ఆనందించారు. ఇంక కొడుకు ఊఁ అంటే చాలునట. కొడుక్కు తన మాట వేదవాక్కు కాబట్టి పిల్ల ఫోటో ఒకటి పంపితే చాలునన్నారు. ఎందుకంటే ఇప్పట్లో అతను ఢిల్లీ నుంచి రాడు.

రామచంద్రం చెల్లెలికి ఫోటో తీయించాడు. అది బాగా రాలేదు.

"నా చెల్లెలు పెద్ద అందగత్తె ఏమీ కాదు. కానీ ఫోటోలో మరీ అసహ్యంగా పడింది. ఆ ఫోటో చూసి పెళ్ళికొడుకు మరోవిధంగా అనుకునే అవకాశముంది. మరో స్టుడియోలో తీయించాలనుకుంటున్నాను" అన్నాడు రామచంద్రం.

నాగేశ్వరరావు వెంటనే, "ఓసారి నీ చెల్లెల్ని మా యింటికి తీసుకుని రాకూడదూ, నేనో ఫోటో తీస్తాను" అన్నాడు.

అతనీ మాట అంటాడనే రామచంద్రం తన విషయం చెప్పాడు. నాగేశ్వరరావుకున్న ఫోటోగ్రఫీ పిచ్చి అలాంటిది.

ఆ సాయంత్రమే రామచంద్రం తన చెల్లెల్ని తీసుకుని నాగేశ్వరరావు ఇంటికి వెళ్ళాడు. భారతికి అంతకుముందుతీసిన ఫోటో కూడా చూపించాడు. "ఫోటో మరీ ఘోరంగాఉంది. కానీ భారతి కూడా ఘోరంగా ఉన్నట్లే లెక్క." అనుకున్నాడు నాగేశ్వరరావు. అతను తన సరంజామా సిద్ధం చేసుకుని భారతికి ఓ ఫోటో తీశాడు. అదృష్టవశాత్తూ అతడి రీలు చివర్లో ఉన్నది. అందువల్ల ఆ రాత్రికి రాత్రే అతను నెగెటివ్‌ను డెవలప్ చేసి నాలుగు ప్రింట్లు తీశాడు. ఈసారి ఫోటోలో భారతి ఉన్నదున్నట్టుగా పడింది. పూర్వం ఫోటోకన్నా చాలా మెరుగు.

నాగేశ్వరరావు మనసులో భారతిమీద జాలిపడ్డాడు. లేని అందాన్ని ఫోటో

తీసుకురాలేదు కదా!

మర్నాడు కాపీలూ, నెగటివూ రామచంద్రానికిచ్చి, "వీలుంటే ఏ ఫొటో స్టూడియోలోనైనా కాస్త దిద్దించు. ఇంకాస్త బాగుంటుంది. నేను సీనరీసు తీసినట్లుగా మనుషుల్ని తియ్యలేను" అన్నాడు నాగేశ్వరరావు.

రామచంద్రం ఆ తర్వాత పది రోజులకు కనిపించాడు.

"చాలా థాంక్స్ గురూ! పెళ్లి కొడుకు తను పిల్లను చూడనక్కరలేదనీ, ముహూర్తాలు పెట్టించవచ్చుననీ రాసేశాడు" అన్నాడు రామచంద్రం.

నాగేశ్వరరావు ఆశ్చర్యపడ్డాడు. భారతికి తనే ఫొటో తీశాడు. ఆ ఫొటోలో ఆమె పెద్దగా బాగోలేదు. అయితే ఉన్నదున్నట్లుగా పడింది. అయితే వరుడికామె అంతలా నచ్చిందా?

'రకరకాల అభిరుచులు' అని మనసులో అనుకుని, "అయితే కంగ్రాట్యులేషన్స్! నేను తీసిన ఆ ఫొటోని నేనోసారి చూడొచ్చా" అనడిగాడు నాగేశ్వరరావు. ఒక వరుడికి నచ్చాక ఆ ఫొటో ఎలా గుందో చూడాలనిపించిందతనికి.

రామచంద్రం నాగేశ్వరరావుని ఇంటికి తీసుకుని వెళ్ళి ఫొటో చూపించాడు. అది చూసి నాగేశ్వరరావు వులిక్కిపడి "మైగాడ్, నేను తీసిన ఫొటోగ్రాపు ఇలా లేదే!" అన్నాడు.

"నీ సలహా ప్రకారమే ఓ ఫొటో స్టూడియోకి తీసుకువెళ్ళి దిద్దించాను. అతను అంతకుపూర్వం తీసిన ఫొటోనీ చూసి నిన్నెంత గానో మెచ్చుకున్నాడు. పూర్వం ఫొటోలో దిద్దడానికి స్కోపు లేదు. ఈ ఫొటో సాయంతో బొమ్మను అందాల రాణిగా తీర్చిదిద్దవచ్చునన్నాడు, దిద్దాడు కూడా!" అన్నాడు రామచంద్రం.

నాగేశ్వరరావు ఆ ఫొటోనే పరిశీలించి చూస్తున్నాడు. పెదిమల దగ్గర, కనుకొలకుల దగ్గర, ముక్కు దగ్గర, చెవుల దగ్గర, జుత్తు దగ్గర ఇలా అన్ని చోట్లా చిన్న చిన్న టచెస్ ఇచ్చాడు. అవే టచెస్ భగవంతుడు ఇచ్చి ఉంటే భారతి చాలా అందంగా ఉండి ఉండేది. అయితే రోజులో ఏదో సమయంలో భారతి ఒక్కసారైనా అలా కనిపించకపోదు.

ఫొటోలో మనిషి భారతి అనడంలో సందేహం లేదు. కానీ...

నాగేశ్వరరావు ఫొటో అక్కడ వదిలి ఇంటికి పరుగెత్తాడు. అతడి కలవరపాటుకు కారణం రామచంద్రానికి తెలియలేదు.

నాగేశ్వరరావు తల్లి దగ్గరకు వెళ్ళి "అమ్మా! అబ్బాయి ఫోటోను చూశాడు, పిల్లను చూడక్కర్లేదు, ముహూర్తాలు పెట్టుకోండని ఉత్తరం రాశారు గదా మీరు పెళ్ళి వారికి! కానీ ఒక్కసారి నేను పిల్లను చూడాలి, ఎలాగో అలా ఈ ఏర్పాటు చెయ్యాలి. పిల్లను చూడందే నేనీ పెళ్ళికి ఒప్పుకోను" అన్నాడు.

కొడుకులాగెందుకంటున్నాడో తెలియక ఆశ్చర్యంగా భర్త దగ్గరకు పరుగెత్తింది నాగేశ్వరరావు తల్లి.

✦ ✦ ✦